# 17. నవదంపతుల చిత్రవధ!

హిమాలయ పరిసరాల్లో గల టెహ్రీగర్వాల్ సంస్థానం యోధాగ్రేసరులకు ప్రసిద్ధి. బ్రిటిష్ సైన్యంలో గార్వాల్ రైఫిల్స్ అనే పేర ఓ దళం కూడా ఉండేది. ఆ దళానికి టెహ్రీగార్వాల్ సంస్థానాధీశుడైన మహారాజా కీర్తిషా బహదూర్ గౌరవాధ్యక్షుడు కూడా.

మహారాజావారు విద్యావంతులు. సుప్రసిద్ధమైన మేయోకాలేజీ పట్టభద్రులు. వారి సంస్థానం కూడా సువిశాలమైనది. డెహ్రాడూన్, ముస్సోరీ, హరిద్వార్, ఋషీకేశ్ వంటి ముఖ్యనగరాలనేకం టెహ్రీగార్వాల్ సంస్థానంలోవే.

అయితే టెహ్రీగార్వాల్ సంస్థానాధీశులకూ, వారి పొరుగునే ఉన్న నేపాల్ రాజవంశీకులకూ సత్సంబంధాలు మాత్రం లేవు.

కనుక...!

విద్యాధికులైన కీర్తిషా బహదూర్‌వారు నేపాల్‌తో సఖ్యంగా ఉండదలచి ఓ ఆలోచనచేసి ఆచరణలో పెట్టేరు.

అదేమంటే...?

యువకుడూ, నవయవ్వనుడూ, సుందరుడూ నైన రాజపురోహితుల వారి కొడుకు మంగ్టూను పిలచి, విలువైన అనేక కానుకలూ, నేపాల్‌తో సత్సంబంధాలను అభ్యర్థిస్తూ నేపాల్ మహారాజా వారికి ఒక లేఖనూ ఇచ్చి అతన్ని సపరివారంగా తన శాంతిదూతగా నేపాల్‌కు పంపారు.

మంగ్టూ ఆకానుకలన్నింటినీ గుర్రాల కెత్తించి, వాటికి దారిలో కాప లాగా, రక్షణగా ఓ చిన్న సైనిక దళాన్ని వెంటబెట్టుకుని అనేక రోజులు ప్రయాణంచేసి క్షేమంగా నేపాల్ రాజధాని ఖాట్మండూ చేరాడు.

ఖాట్మండూ రాచ వీధిగుండా మంగ్టూ అలా తనబృందంతో విడిదికి వెడుతుండగా...ఓ మేడమీద నుండి ఒక చిన్నది, పదారేళ్ళ పరువంలో ఉన్నది, అపురూప లావణ్యవతి, నేపాల్ రాజ పురోహితుల వారి అనుంగు బిడ్డ, గారాలపట్టి అయిన 'విజయ' ఆ సుందరాంగుణ్ణిచూసి, మోహించి, అందులో పడి మునకలై, ఉక్కిరి బిక్కిరై...

ఓ చెలికత్తె సాయంతో తెలివైన పనొకటి చేసింది. ఆ చెలికత్తె మంగ్టూ పరివారంలోని ముఖ్యలొకరికి వజ్రాలహారం లంచంగాఇచ్చి టెహ్రీ గార్వాల్ మహారాజావారు నేపాల్ మహారాజావారి స్నేహం కోరుతూ పంపిన సందేశం సంపాదించింది.

విజయ ఆ సందేశం చివర్న తెలివిగా "మా రాచ పురోహితుల బిడ్డను పంపుతున్నాం. వారికి మీ రాచపురోహితుల బిడ్డనిచ్చి వివాహంచేసి మన రెండు సంస్థానాల స్నేహాన్ని బాంధవ్యంగా కూడా మార్చి శాశ్వతంగా ధన్యులమవుదాం" అని స్వయంగా అదే దస్తూరీలో వ్రాసింది.

అలా మార్చిన సందేశాన్ని చెలికత్తె మరో రత్నాల హారంతో సహా మంగ్టూ సేవకునికి అందివ్వగా వాడు దాన్ని యధాస్థానంలో ఉంచేశాడు.

ఆ మర్నాడు నిండు పేరోలగంలో మంగ్టూ తాను తెచ్చిన కానుకలనూ, సందేశాన్నీ నేపాల్ మహారాజావారి కందివ్వగా...!

వారున్నూ చదివి సంతోషించినవారై పురోహితులతో సంప్రదించి, వారి అమోదం పొందినవారై 'శుభం' అనేసేరు.

అందుమీదట సమీపంలో మరేమీ లగ్నాలు లేవనే కారణాన ఆ మరు సటి దినమే మహావైభవంగా విజయ, మంగ్టూల పాణిగ్రహణ మహో త్సవం స్వయంగా దగ్గరుండి జరిపించారు.

ఇదేమీ ముందుగా సూచనగా కూడా తెలియని మంగ్టూ, విజయ సౌందర్యానికి ఉక్కిరి బిక్కిరైపోయి మారు మాట్లాడకుండా పాణి గ్రహణంచేసి మైమరచి పోయాడు.

మంగ్టూ ఆ విధంగా నాలుగు నెలలదాకా నవ వధువుతో పాటు మహారాజావారి ముఖ్య అతిథిగా సకల భోగాలు అనుభవిస్తూ జీవిత మకరందాన్ని తనివితీరా గ్రోలుతూన్న సమయాన...!

ఓ సుప్రభాతాన, తనకో ఊరూ, కుటుంబం ఉన్నాయని గుర్తుకు వచ్చినవాడై టెహ్రీ గార్వాల్‌కు సతీసమేతంగా తిరిగి వెళ్ళేందుకు మహా రాజావారి అనుమతి కోరాడు.

శ్రీవారున్నూ సంతోషించి ఇటు నవదంపతులకు, అటు టెహ్రీ గార్వాల్ సంస్థానాధీశులకూ స్నేహ, బాంధవ్యాలకు గురుతుగా వెలలేని కానుకలిచ్చి, అవన్నీ గుర్రాల కెత్తించి, రక్షణగా, హోదాకు తగినట్టు వేయిమంది సాయుధ సైనికులనిచ్చి సాగనంపేరు.

మంగ్టూ బృందం అలా పయనించి నేపాల్ సరిహద్దు దాటి టెహ్రీ గార్వాల్ భూభాగంపై అడుగుపెట్టగానే అతని వెంటగల వేయిమంది సాయుధ గుర్ఖా సైనికులను చూసిన వార్తాహరులు అంచెలమీద మహా రాజా కీర్తిషా బహదూర్ వారికి వార్తనందించారు.

ఆ వార్తల సారాంశం ఏమంటే మంగ్టూ నేపాల్ మహారాజా వారి వద్దలంచంతిని, వారి దాసీపిల్ల మోజులోపడి,వారి ఏజంటుగా మారిపోయి, పెద్ద సైన్యంతో టెహ్రీ గార్వాల్‌ను స్వాధీనం చేసుకునేందుకు గాను నేపాల్ మహారాజా వారి తరపున దండెత్తి వస్తున్నాడని....

మహారాజా కీర్తిషా బహాదూర్ వారు మొదట ఈ వార్తను నమ్మ లేదు. కాని, పదేపదే అవే వార్తలు రావటంతోనూ, అంత పెద్ద సాయుధ సైన్యం మంగ్టూ వెంట ఉండటంతోనూ చివరికి నమ్మక తప్పనూ లేదు. ఎందుకంటే, యుద్ధపరి భాషలో వేయి మంది గూర్ఖా సైనికు లంటే పదివేల మంది సాధారణ సైనికులకు సమానం.

కనుక...

మహారాజా కీర్తిషా బహుదూర్ వారు మరి ఆలోచించకుండా ఓ పెద్ద సైన్యాన్ని పంపి మంగ్టూ బృందాన్ని నలువైపుల నుండీ చుట్టు ముట్టించి నవ దంపతులతో సహా వారిని చిత్రవధ చేయించారు.

ఈ ఘోరం విన్న నేపాల్ మహారాజా వారు నివ్వెరపోయి మరు క్షణం సర్వ సైన్యాధ్యక్షుని నాయకత్వాన మహా సైన్యాన్నొక దానిని టెహ్రీ గార్వాల్ మీదికి నడిపించేరు.

ఆ సైన్యం ముందు తన పరాజయం తథ్యమని గ్రహించిన వారై మహారాజా కీర్తిషా బహదూర్‌వారు తక్షణం తన సంస్థాన రక్షణకై బ్రిటిష్ వారి సాయం కోరారు. బ్రిటిష్ సేనల సాయంతో నేపాల్ సేనలను సరిహద్దులు దాటి రాకుండా నిరోధించగలిగేరు. ఆ విధంగా సంస్థానాన్ని కాపాడుకున్నారు.

కానీ... !

బ్రిటిష్‌వారు మాత్రం తమ సేవల క్రింద టెహ్రీ గార్వాల్ సంస్థా నంలోని కీలక ప్రాంతాలనేకం కొట్టేసి తమ పెత్తనం క్రింద గల భూభా గంలో మర్యాదగానే కలిపేసుకున్నారు.

ఆ విధంగా వారికి దక్కినవే ముస్సోరీ, డెహ్రాడూన్, షహరాన్ పూర్ లాంటి ఈనాటి సుప్రసిద్ధ విలాస కేంద్రాలు.

★